క్లుప్తంగా

25న ఉపాధి పనులపై ప్రజావేదిక

పెనమలూరు: మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం కింద పనుల పై ఈ నెల 25వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి ప్రణవి తెలిపారు. ఆమె బుధవారం వివరాలు వివరాలు వెల్లడించారు. జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకం కింద వివిధ గ్రామాల్లో చేపట్టిన పనుల పై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రజావేదికకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: పోరంకిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలు కావటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు తాడిగడప సెంటర్ సుగాలీ కాలనీకి చెందిన ఎం.అనసూయమ్మ స్థానికంగా నివాసం ఉంటూ ఇళ్లలో పనులు చేస్తోంది. ఆమె పోరంకి క్యాపిటల్ ఆస్పత్రి సమీపంలో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు దాటుతుండగా కంకిపాడు వైపు నుంచి వచ్చిన బైక్ ఆమెను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పంటలకు గిట్టుబాటు ధర పొందాలి



పెనమలూరు: మినుము, పెసలు పండించిన రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని, వారి పంటలకు గిట్టుబాటు ధర పొందాలని ఏఓ కనకమేడల శైలజ అన్నారు. వణుకూరు గ్రామంలో బుధవారం పొలంపిలుస్తొంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 2024-2025 సీజన్‌లో రైతులు పండించిన పంటలు నమోదు ప్రక్రియ పూర్తిగా జరిగిందన్నారు. పెసలుకు (100 కేజీలు)రూ.8,700, మినుము రూ.7,200 గిట్టుబాటు ధర మార్క్‌ఫెడ్ ఇస్తోందని తెలిపారు. పంట నాణ్యతను బట్టి ధర నిర్ణయిస్తారని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీటీమ్ శ్రీనివాసరావు, డీడీఏ జ్యోతి, ఏఓ పద్మజ పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు



పెనమలూరు: మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారిని ఆపి బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ హెల్మెట్‌లు ధరించని పక్షంలో జరిమానా విధిస్తామన్నారు. అలాగే గతంలో వాహనాల పై ఉన్న జరిమానా వెంటనే చెల్లించాలని లేని పక్షంలో మళ్లీ ఫైన్ వేయాల్సి వస్తుందన్నారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే ఆ వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడి ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు.

మద్యం షాపు వద్ద ఘర్షణ

బీరు సీసాతో వ్యక్తిపై హత్యాయత్నం

పెనమలూరు: మద్యం షాపు వద్ద తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఓ వ్యక్తి పై మరో వ్యక్తి బీరు సీసాతో దాడి చేశాడు. ఈ ఘటన పై పోలీసులు బుధవారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు కానూరు 100 అడుగుల రోడ్డులో స్టార్ బార్ వద్దకు మంగళవారం అర్ధరాత్రి నిడమానూరు చెందిన ఐనంపూడి ప్రసాద్, బూరాడ రాధాకృష్ణ వచ్చారు. ఐనంపూడిప్రసాద్ తన మిత్రుడు నిడమానూరు వినాయకుడి గుడి ప్రాంతానికి చెందిన అలిగినేని సురేంద్రకు ఫోన్ చేసి మద్యం తాగుదామని రమ్మన్నాడు. దీంతో సురేంద్ర బైక్‌పై బార్‌షాపు వద్దకు వచ్చాడు. సురేంద్ర బార్‌షాపుకు రాగానే అక్కడే ప్రసాద్‌తో ఉన్న బూరాడ రాధాకృష్ణ 'నేను బ్లేడ్ బ్యాచ్ అని ఎందుకు నా గురించి అందరికీ చెడుగా చెబుతున్నావు' అని సురేంద్రపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో సురేంద్రకు, రాధాకృష్ణకు మధ్య వాగ్వాదం జరిగింది. రాధాకృష్ణ బీరు సీసాతో సురేంద్రపై దాడి చేసి బీరు సీసాతో పొడిచాడు. తీవ్రగాయాలు కావటంతో సురేంద్ర పడిపోయాడు. ఈ సమాచారం తెలుసుకున్న సురేంద్ర బంధువులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సురేంద్రను సమీపంలో ఉన్న ఆస్పత్రిలో అత్యవసర చికిత్స కోసం సురేంద్రను చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాధాకృష్ణ పై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

రాళ్లుతేలిన రోడ్డుతో ఇక్కట్లు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం, అల్లాపురం గ్రామాలను చిన్నఆవుటపల్లి పరిధిలోని జాతీయ రహదారికి అనుసంధానించే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రోడ్డు పూర్తిగా రాళ్లు తేలిపోయి గోతుల మయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారికి కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదు. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్కపక్కనే ఉండే దావాజిగూడెం, అల్లాపురం గ్రామాల నుంచి హిందూ శ్మశానవాటిక మీదుగా జాతీయ రహదారి వరకు రెండు కిలోమీటర్ల పొడవునా రహదారి విస్తరించి ఉంది. గతంలో అల్లాపురం గ్రామ పరిధి వరకు బీటీ రహదారి నిర్మించారు. మిగిలిన 1.5 కిలోమీటర్ వరకు రహదారిని గ్రావెల్ మట్టితో కప్పి వదిలివేశారు. ఈ రహదారిలోని శ్రీనివాస హేచరీస్, ఈ-కామర్స్ గిడ్డంగి, అనేక రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయి. అయినప్పటికీ ఈ రహదారి అభివృద్ధికి ఎవరూ ముందుకురాని పరిస్థితి నెలకొంది.

రహదారిని గ్రావెల్‌తో కప్పి వదిలేశారు



అధ్వానంగా మారిన జాతీయ రహదారికి అనుసంధానించే ప్రధాన రహదారి

గోతుల మయంగా రహదారి

అల్లాపురం, దావాజిగూడెం నుంచి చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారికి వెళ్లేందుకు ఈ రహదారే అత్యంత దగ్గర మార్గం. అంతే కాకుండా ఈ రెండు గ్రామాలకు చెందిన వందలాది మంది చిన్నఆవుటపల్లి పరిధిలోని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రి, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు, వైద్య అవసరాలు నిమిత్తం ఇటుగానే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు దశాబ్ద కాలంగా ఈ రహదారి ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో పాటు కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ఫలితంగా గ్రావెల్ రోడ్డు రాళ్లు తేలిపోయి గోతులు ఏర్పాడ్డాయి. అడుగుకో గుంత ఉండడంతో ఈ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగించాలంటే భారీగా కుదుపులకు గురవుతున్నాయి. ఈ రహదారిపై వీధిలైట్లు కూడా లేకపోవడంతో రాత్రివేళలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. దీంతో సుమారు రెండు కిలోమీటర్లు చుట్టూ తిరిగి గన్నవరం మీదుగా వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనివల్ల వందలాది మంది ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

నిధులు కేటాయించాలి

మూడు గ్రామాలను అనుసంధానించే ప్రధాన రహదారి అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి. ఈ రహదారి పూర్తిగా గోతుల మయంగా మారడంతో రాకపోకలకు అనువుగా లేదు. దీనివల్ల ఇటుగా రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

–ఆవుటపల్లి మోహన్‌రావు, దావాజిగూడెం

రాకపోకలకు ఇబ్బందులు

జాతీయ రహదారికి అనుసంధానించే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయడం వల్ల అల్లాపురం, దావాజిగూడెం ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఉద్యోగ, ఉపాధి, వైద్య, వ్యవసాయ పనుల నిమిత్తం ఈ రహదారిపై నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

–దొక్కు సాంబశివవెంకన్నబాబు, సర్పంచ్, అల్లాపురం

సామూహిక అత్యాచార నిందితులను శిక్షించాలి

గన్నవరం: ఎన్టీఆర్ జిల్లా జి. కొండూరుకు చెందిన బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఎనిమిది మంది నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి బీ. కీర్తి డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం ఐద్వా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ వీరపనేనిగూడెంలో స్నేహితురాలి ఇంటికి వచ్చిన సదరు బాలికపై గ్యాంగ్ రేప్ చేయడం సభ్యసమాజం తలదించుకునే విషయమన్నారు. గంజాయి తాగుతూ అల్లరిచిల్లరగా తిరిగే యువకులే ఇటువంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతోందన్నారు. గంజాయి నియంత్రణ విషయంలో ప్రభుత్వం మాటలు తప్ప చేతల్లో చేస్తుందేమీ లేదన్నారు. బాలికపై సామూహిక అత్యాచార సంఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి నిందితులను త్వరగా శిక్షించడంతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బుద్దవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, ఐద్వా నాయకులు స్వరూపరాణి, సిహెచ్‌వీ. లక్ష్మీ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కీర్తి

సునీతా విలియమ్స్ సాధించిన విజయం ఆదర్శం

పాయకాపురం(విజయవాడ రూరల్): ప్రపంచ అంతరిక్ష పరిశోధన యాత్రికురాలు సునీతా విలియమ్స్ సాధించిన విజయం అందరికీ ఆదర్శనీయమని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ పేర్కొన్నారు. సునీతా విలియమ్స్ సాధించిన విజయాన్ని పురస్కరించుకుని బుధవారం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల వలన వాతావరణంలోని మార్పులకు కారణాలను కచ్చితంగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. కనుక ఇలాంటి గొప్ప ప్రయోగాలను శాస్త్రవేత్తలు చేస్తూ ఉంటారన్నారు. నాసా తరపున సునీత విలియమ్స్ తొమ్మిది నెలల క్రితం పరిశోధనల కోసం అంతరిక్ష యానం చేసిన విషయం తెలిసిందేనన్నారు. అయితే యాంత్రిక లోపం వలన సునీతా విలయమ్స్ అక్కడే ఇరుక్కుపోవడం జరిగిందన్నారు. ఆమెను భూమ్మీదకు తీసుకురావడానికి శాస్త్రవేత్తలు అనేక ప్రయత్నాలు చేశారన్నారు. అవరోధాలు కలిగినా ఎట్టకేలకు అంతరిక్ష నౌక ద్వారా భూమి పైకి సురక్షితంగా తీసుకొచ్చారన్నారు. భారతి సంతతికి చెందిన ఒక స్త్రీ ప్రపంచ అంతరిక్ష యాత్రికురాలిగా గొప్ప విజయాన్ని సాధించారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో స్ఫూర్తిని నింపే విధంగా అనేకమంది శాస్త్రవేత్తలు విజయ యాత్రలు నిర్వహించారన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక సంపదను పెంపొందించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఉదయలక్ష్మి, ఉపాధ్యాయులు నళిని శిరీషా పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సాధువులపై ప్రభుత్వం తీరు అమానుషం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తిరుమలలో సాధువుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు అమానుషమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తంచేశారు. తిరుపతి నుంచి విశాఖపట్నం వెళుతున్న రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి స్వామిని మార్గమధ్యంలో బుధవారం మల్లాది విష్ణు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయటంపై ఆయన తీవ్రంగా స్పంచించారు. హిందువుల మనోభావాలకు విరుద్ధంగా తిరుమలలో నిర్మిస్తున్న ముంతాజ్ హోటల్‌కు అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆధ్యాత్మిక నగరాన్ని పర్యాటకం పేరిట కూటమి ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలిపిరిలో శ్రీవారి పాదాల చెంత ముంతాజ్ హోటల్ నిర్మాణంపై సాధువులు, హైందవ సంఘాలు భగ్గు మంటున్నా ఈ ప్రభుత్వంలో కనీస చలనం లేదని ధ్వజమెత్తారు. తిరుమల ప్రక్షాళన అంటే ఏడు కొండలను అపవిత్రం చేయటమా..? అని ప్రశ్నించారు. తిరుమల కొండలను కళంకం చేసేలా అన్యమతానికి చెందిన ముంతాజ్ హోటల్ నిర్మాణానికి అనుమతివ్వడం దారుణమన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ పట్ల, తిరుమల పవిత్రత పట్ల ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలను ఒక వ్యాపార కేంద్రంగా మార్చి వేసిందన్నారు. హిందు ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత సాధువులపై ఉందన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న సాధువుల పట్ల ఈ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. తిరుమల ప్రక్షాళన అంటూ వల్లె వేసే సీఎం చంద్రబాబు, సనాతన ధర్మ పరిరక్షణ అంటూ ఊగిపోయే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీనిపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలను గౌరవించి హోటల్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి స్వామిని కలిసి మాట్లాడుతున్న మల్లాది విష్ణు

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తన కుమారుడు గత నెల 25వ తేదీ నుంచి కనిపించటం లేదంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు గన్నవరం గుండ్రపాటి పుష్పమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు గుండ్రపాటి రవికుమార్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఈయన అజిత్‌సింగ్‌నగర్ ఎంబీబేగ్ స్కూల్ సమీపంలో నివసిస్తున్నాడు. ఇతడి భార్య వదలివేయటంతో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇతను మద్యానికి బానిస కావటంతో తల్లి తరచూ ఆర్థిక సాయం చేస్తుండేది. ఈ క్రమంలో గత నెల 25వ తేదీన రవికుమార్ ఫోన్ చేసి తాను కొత్త ఫోన్ కొన్నానని తన నంబర్ ఫీడ్ చేసుకోవాలని తల్లికి చెప్పాడు. తల్లి ఫోన్ నంబర్ ఫీడ్‌చేసుకున్న తరువాత సాయంత్రం ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో ఆమె అజిత్‌సింగ్‌నగర్ వచ్చి చూడగా కుమారుడు ఇంట్లో లేడు. అప్పటి నుంచి చుట్టు పక్కల వారి వద్ద విచారించారు. ఫలితం లేకపోవటంతో బుధవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరా లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహణ ఇంజినీర్ పి. హరిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేసరపల్లి, అప్పారావుపేట, అజ్జంపూడి, బుద్దవరం, బూతిమిల్లిపాడు, కేసరపల్లి హౌసింగ్ కాలనీకి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



కంకిపాడు: పునాదిపాడు జెడ్పీ పాఠశాల్లో ఏర్పాటుచేసిన పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని ఉయ్యూరు ఆర్‌డీఓ హెలా షారోన్ బుధవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో వసతులపై ఆరా తీశారు. తనిఖీలో తహసీల్దార్ భావనారాయణ, ఎంఈఓ-2 కె.ప్రసాద్, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఎనిమిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. 1,466 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 1,465 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారు.

హుండీ ఆదాయం రూ.9.54 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.9,55,934 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీల కానుకలను బుధవారం దేవదాయశాఖాధికారి సృజన్ కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. సాయి సేవాదళ్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

30 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ పద్మలత తదితరులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళ ఫార్మసీ కళాశాల విద్యార్థినులు 30 మంది ఏడీఈపీటీ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ పద్మలత తెలిపారు. పద్మలత మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన ఏడీఈపీటీ సంస్థ వారు విద్యార్థినులకు రాత, సాంకేతిక, మౌఖిక పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ ఎంపికలకు సుమారు 66 మంది విద్యార్థినులు హాజరయ్యాని తెలిపారు. వీరిలో 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు మానవ వనరుల మేనేజర్ రాజీవ్, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కంకిపాడు: అపరాల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటుచేసిన అపరాల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్ ఒడిదుడుకులను అధికమించేందుకు కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం మురళీకిషోర్, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సీహెచ్‌సీ చైర్మన్ బోయిన రోహిణీకుమారి, నేతలు చలవాది రాజా గురవయ్య, పులి కామేశ్వరరావు, అన్నే రామారావు పాల్గొన్నారు.



కంకిపాడు మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పోరాటాలతోనే కార్మికులకు న్యాయం

గన్నవరం రూరల్: పోరాటాలతోనే కార్మికులకు న్యాయం జరుగుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని ముస్తాబాద రిలయన్స్ గోడౌన్ వద్ద యాజమాన్యం అక్రమంగా కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించటంతో, వారు చేస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి కార్మికులు దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించి, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. ఏకపక్షంగా కంపెనీని మూసివేస్తామని చెప్పటం దారుణమన్నారు. కార్మికులు ప్రశ్నిస్తే గొంతు నొక్కాలని చూడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్ట పరంగా కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులంతా ఐక్యంగా నిలబడి సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు నరసింహారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రాంబాబు, బాబు పాల్గొన్నారు.



కార్మికుల రిలే దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం

పెనమలూరు: యనమలకుదురులో బాధిత కుటుంబానికి పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి బుధవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. యనమలకుదురుకు చెందిన పార్టీ సానుభూతిపరుడు ఊటుకూరి వెంకటేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి చక్రవర్తి ఇచ్చిన రూ.10 వేలను వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వీరబాబు అందజేశారు.

చక్రవర్తిని కలిసిన మందూరి

పెనమలూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన చోడవరం గ్రామానికి చెందిన మందూరి కోటేశ్వరరావు బుధవారం కానూరులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వమకర్త దేవభక్తుని చక్రవర్తిని కలిశారు. పార్టీ తనను నమ్మి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పార్టీ కన్వీనర్ మానికొండ సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ స్థాయి సదస్సు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పీబీ సిద్ధార్థ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించనున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. సిద్ధార్థ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

సంక్షిప్తం వార్తలు

కత్తిసాము పోటీలకు స్ఫూర్తి ఎంపిక



గన్నవరం: జాతీయ స్థాయి దివ్యాంగుల కత్తిసాము(ఫెన్సింగ్) పోటీలకు స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని స్ఫూర్తి ఎంపికైనట్లు హెచ్‌ఎం జీవీ. రవిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్ఫూర్తి అసమాన క్రీడా నైపుణ్యం ప్రదర్శించి గోల్డ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. స్ఫూర్తితో పాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన డి.నాగరాజును హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రెండు ఎకరాల మినుము కుప్ప దగ్ధం

ఉంగుటూరు: అగ్నిప్రమాదం సంభవించి రెండు ఎకరాల మినముకుప్ప దగ్ధమైంది. ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని పొలాల్లో ఉన్న మినుముపొట్టుపై గుర్తుతెలియని వ్యక్తులు నిప్పురవ్వ వేయడంతో గాలికి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో కొంత దూరంలో ఉన్న వీర్ల కృష్ణకు చెందిన రెండు ఎకరాల మినుము కుప్పకు మంటలు అంటుకున్నాయి. స్థానికుల సమాచారంతో గుడివాడ అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే మినుము కుప్ప పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.80వేల ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు వాపోయాడు.

వరికుప్ప దగ్ధం

రూ.2లక్షల నష్టం

ఉంగుటూరు: గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఎకరాల వరికుప్పకు నిప్పుపెట్టిన ఘటన చాగంటిపాడులో జరిగింది. చాగంటిపాడులో బుధవారం తెల్లవారుజామున శనగల రామ్మోహన్‌రావుకు చెందిన రెండు ఎకరాల వరికుప్పకు మంటలు వ్యాపించడం స్థానికులు చూసి ఆ రైతుకు తెలిపారు. రైతు నుంచి సమాచారం తెలుసుకున్న గుడివాడ ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే వరికుప్ప పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.రెండు లక్షలు నష్టం సంభవించిందని బాధితరైతు వాపోయాడు. గుర్తుతెలియని వ్యక్తులు వరి కుప్పకు నిప్పు అంటించారని పేర్కొన్నాడు.

మూడో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ కోదండరామాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థం హోమం జరిగింది. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్.రాజు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సురభి నాటక ప్రదర్శన



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సృజనాత్మక సమితి, దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం తంజావూరు ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల్లో నిర్వహిస్తున్న సురభి నాటకోత్సవాలు పద్య నాటక వైభవాన్ని చాటుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర నాట్య మండలి, శ్రీ సరదా కళావినోదిని ఆధ్వర్యంలో జై పాతాళభైరవి జానపద నాటకాన్ని ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలో సాంస్కృతిక శాఖ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకుడు సుమన్, నర్తనం ప్రధాన సంపాదకురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.